క్లుప్తంగా

పేకాట శిబిరంపై దాడి

కవిటి: మాణిక్యపురంలోని దేవాలయం ఎదురుగా బహిరంగ ప్రదేశంలో ఆదివారం రాత్రి పేకాట అడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కవిటి ఎస్సై వి.రవివర్మ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 10,620 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయండి

నందిగాం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకరంగా మండలంలో మంగళవారం చేపట్టనున్న కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. మధ్యాహ్నం మూడు గంటలకు కవిటిఅగ్రహారంలో, నాలుగు గంటలకు ప్రతాపవిశ్వనాథపురంలో, ఐదు గంటలకు హరిదాసుపురంలో కార్యక్రమం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ హాజరవుతారన్నారు.

వడ్డితాండ్ర-రావివలస రహదారికి మరమ్మతులు చేయండి

టెక్కలి: టెక్కలి మండలం రావివలస నుంచి సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర వరకు గల రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆర్‌వీ రోడ్డు సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. రావివలసలో ఎండల మల్లన్న ఆలయాన్ని కలుపుకుని వడ్డితాండ్ర వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గోతులతో రాకపోకలకు ఇబ్బందులు కలిగే విధంగా ఉన్నాయని వెల్లడించారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సాధన కమిటీ కన్వీనర్ కోత మధుసూదనరావు, బి.వి.రెడ్డిబాబు, కె.చిన్నబాబు, అప్పన్న, మల్లికార్జున కోరారు. ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు


రైతులను అదుపు చేస్తున్న ఎస్సై పారినాయుడు

కంచిలి: మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. ఈ కేంద్రానికి సోమవారం యూరియా రావడంతో చాలా కాలంగా టోకెన్లు తీసుకొన్న రైతులు ఒక్కసారిగా చేరుకొన్నారు. దీంతో అక్కడ పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక ఎస్సై పి.పారినాయుడు వచ్చి క్యూలైన్లో వెళ్లి టోకెన్ ఇచ్చి యూరియా తీసుకోవాల్సిందిగా సూచించారు.

కల్తీ మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

ఇచ్ఛాపురం: దుకాణాల్లో కల్తీ మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పి.దుర్గాప్రసాద్ తెలిపారు. కల్తీ మద్యానికి సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయన్నారు. కల్తీ మద్యం విక్రయాలు జరుగకుండా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సహకారంతో పాటు గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలరు సహకరించాలని కోరారు. కల్తీ మద్యం గురించి తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14405కి సమాచారం ఇవ్వాలని కోరారు.

చిన్నారి ఆరోగ్యానికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీకి చెందిన బండారు పావని ఏడాదిన్నర కుమార్తె దియా న్యుమోనియా వ్యాధితో బాధపడుతోంది. వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో దాతల సాయం కోసం ఎదురు చూశారు. విషయం తెలుసుకున్న సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు సోమవారం రూ. 10 వేలు సాయాన్ని అందించి పెద్ద మనసు చాటుకున్నారు.

అమ్ముతున్నది కల్తీ మద్యం


పోలీసులను ప్రతిఘటిస్తూ ముందుకు పోతున్న మహిళలు, ఇతర కార్యకర్తలు

- ఆపై అదనపు చార్జీలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వం
- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- పలాసలో పోలీసుల ఆంక్షల మధ్య నిరసన

పలాస: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ కల్తీ మద్యం విక్రయించడంతోపాటు దానిపై కూడా అదనపు చార్జీలు వసూలు చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు దుయ్యబట్టారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపులో భాగంగా పలాసలో మాజీ మంత్రి అప్పలరాజు ఆధ్వర్యంలో జోరు వర్షంలో కూడా మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. పోలీసుల ఆంక్షల మధ్య కాశీబుగ్గ శ్రీనివాస్ లాడ్జి కూడలిలో మానవహారం నిర్వహించారు. సీఎం డౌన్‌డౌన్, కల్తీ మద్యం అరికట్టాలి, నాణ్యమైన మద్యమంటే నకిలీ మద్యమా, ఎన్‌- బ్రాండ్ కల్తీ మద్యంతో జనం బలి, ఎన్‌-బ్రాండ్ కల్తీ మద్యం నిలిపివేయాలని మహిళలు నినాదాలతో హోరెత్తించారు. అనంతరం అక్కడ నుంచి పోలీసులు నిరాకరిస్తున్నప్పటికీ వారిని ప్రతిఘటిస్తూ మహిళలు ముందు వరుసలో ఉంటూ ఎక్సైజ్ పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్రకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. కల్తీ మద్యం సూత్రధారి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అని చెప్పారు. కల్తీ మద్యం వల్ల చాలా మంది ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్ముతున్నది కల్తీ మద్యం అయితే దానికి తోడు అదనంగా వసూలు చేస్తున్నారని, మద్యం సిండికేటు వ్యాపారులు విచ్చల విడిగా వ్యాపారాలు చేస్తుంటే ఎక్సైజ్ పోలీసు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారని ఆరోపించారు. పలాసలో అయితే అల్లుడు టాక్స్ పేరుతో ఎమ్మెల్యే కనుసన్నల్లోనే సిండికేటు లిక్కర్ వ్యాపారం కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మాట ఇప్పుడు నేనన్నది కాదని గతంలో జనసేన నేత పవన్ కళ్యాణే అన్నారని.. ఇప్పుడు అదే జరుగుతుందన్నారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని, అదనపు చార్జీలు లేకుండా నాణ్యమైన మద్యాన్ని ప్రజలకు అందించాలని, ఈ మద్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు సీదిరి శ్రీదేవి, సుజాత పండా, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, మున్సిపల్ కౌన్సిలర్ బోర చంద్రకళ, సేనాపతి దివ్య, బల్ల ఉషారాణి, జల్లు ఉషారాణి, హేమావతి, లలిత, వైఎస్సార్‌సీపీ నాయకులు శిస్టు గోపి, బోర క్రిష్టారావు, బత్తిన హేమేశ్వరరావు, బడగల బల్లయ్య, మందస ఎంపీపీ డొక్కర దానయ్య, అగ్గున సూర్యారావు, దల్లి జానికీరెడ్డి, దువ్వాడ రవి, బెల్లాల శ్రీనివాసరావు, గుజ్జు జోగారావు, పాలిన శ్రీనివాసరావు, ఉప్పరపల్లి ఉదయకుమార్, దువ్వాడ మధుకేశ్వరరావు, పి.వి.సతీష్, నర్తు వెంకటరమణ, సవర చంద్రమ్మ, వజ్రపుకొత్తూరు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, మల్లా సురేష్‌కుమార్, బమ్మిడి సంతోష్‌కుమార్, తమ్మినాన శాంతారాం పాల్గొన్నారు.


పలాస ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీమంత్రి అప్పలరాజు, నాయకులు

కల్తీ మద్యం కేసులో బాధ్యులపై చర్య తీసుకోవాలి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్
- నియోజకవర్గంలో మంత్రి, ఆయన సోదరుడి అండతో మద్యం మాఫియా
- కల్తీ మద్యానికి వ్యతిరేకంగా కదంతొక్కిన పార్టీ శ్రేణులు


టెక్కలి ఎక్సైజ్ సీఐ మీరాసాహెబ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇన్‌చార్జి పేరాడ తిలక్, నాయకులు దువ్వాడ వాణి, గొండు చాందిని తదితరులు


టెక్కలి: కల్తీ మద్యం కేసులో బాధ్యులపై చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేక దర్యాప్తు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌తో పాటు నియోజకవర్గం నాయకులు డిమాండ్ చేశారు. కల్తీ మద్యానికి వ్యతిరేకంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం టెక్కలిలో మహిళలు, పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. టెక్కలి ఎక్సైజ్ కార్యాలయం ఎదురుగా పాత జాతీయ రహదారిలో ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సిండికేట్ విధానంతో మద్యాన్ని పెద్ద ఎత్తున మాఫియాగా మార్చేశారని మండిపడ్డారు. ఇప్పుడు మద్యాన్ని కాలకూట విషంగా మార్చేసి ఎంతో మందిని బలిగొన్నారన్నారు. టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరివరప్రసాద్ అండతో పెద్ద ఎత్తున మద్యం మాఫియా కొనసాగుతోందన్నారు. వేల సంఖ్యలో బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసి ఒడిశా నుంచి అక్రమంగా మద్యాన్ని దిగుమతి చేసుకుంటున్నారని ఆరోపించారు. టీడీపీకి చెందిన వ్యక్తి కల్తీ మద్యాన్ని తయారుచేస్తూ పట్టుబడ్డాడని.. ఆ వ్యక్తి హరివరప్రసాద్ అనుచరుడన్నారు. కల్తీ మద్యం కేసుపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి, చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఉన్న దుకాణాలను తొలగించాలని, వైన్ షాపుల కేటాయింపులో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని తిలక్‌తో పాటు నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టెక్కలి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు దువ్వాడ వాణి, దుబ్బ వెంకట్రావు, పార్టీ మండల కన్వీనర్లు హెచ్.వెంకటేశ్వర్రావు, ఎస్.హేమసుందర్‌రాజు, టి.ఫాల్గుణరావు, బి.మోహన్‌రెడ్డి, నాయకులు యర్ర చక్రవర్తి, సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్, జి.గురునాథ్‌యాదవ్, మహిళా విభాగం నాయకులు జి.చాందిని, పి.లక్ష్మి, ఎం.ఈశ్వరమ్మ, టి.విమల, లక్ష్మి, పూర్ణిమ, పద్మజ, నారాయణమ్మ, పి.రమేష్, ఎస్.సత్యరాజ్, కె.జీవన్, వి.శ్రీధర్‌రెడ్డి, ఎ.రాహుల్, ఎ.విష్ణు, చిన్ని జోగారావు, ఎస్.వినోద్, జనార్దన్‌రెడ్డి, పి.వెంకట్రావు, డి.రామకృష్ణారెడ్డి, డి.పోలయ్య, బి.కార్తీక్, కె.సంజీవ్, జి.సోమేష్, డి.నీలకంఠం, బి.గోపాల్, ఎం.నాగభూషణ్, కె.సతీష్, పి.మోహన్, శివారెడ్డి, జి.బాబూరావు, గౌడ శ్రీనివాస్, టి.రాజు, కూర్మారావు, బి.రాకేష్, పి.రామయ్య, డి.లోకేష్‌రెడ్డి, ఎ.లోకనాథం, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


టీచర్ అవతారమెత్తిన డీఎల్‌పీవో


విద్యార్థినులకు ప్రశ్నలు అడుగుతున్న డీఎల్‌పీవో ఐ.వి.రమణ

నందిగాం: టెక్కలి డివిజన్ పంచాయతీ విస్తరణాధికారి ఐ.వి.రమణ సోమవారం లఖిదాసుపురం ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా టీచర్ అవతారమెత్తి పదో తరగతి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. గ్రామ పరిశీలన నిమిత్తం వచ్చిన ఆయన పాఠశాలలో రూ.75 వేల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు, ఎల్ఈడీ లైట్లను పరిశీలించారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వివిధ సబ్జెక్టుల్లోని విషయాలపై ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అధిక మార్కులు సాధించేందుకు మెళకువలు, జవాబులు రాసే విధానాలు తెలియజేశారు. సర్పంచ్ బొంగి అమ్ములమ్మ, పంచాయతీ కార్యదర్శి బి.స్వరూప్, ప్రధానోపాధ్యాయులు చిలుకు క్రిష్టారావు, మాదిన లోకనాథం ఉన్నారు.

నిబద్ధతతో పనిచేయండి


కంచిలి: నియామక పత్రాలు అందిస్తున్న ఎంఈవోలు


ఇచ్ఛాపురం రూరల్: నియమాక పత్రాలు అందుకుంటున్న నూతన ఉపాధ్యాయులు

కంచిలి: కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలో చేరుతున్న వారంతా నిబద్ధతతో పనిచేయాలని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు కోరారు. ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులకు మండలంలోని వివిధ యాజమాన్యాల్లో నియామక బాధ్యతలు సోమవారం అప్పగించిన నేపథ్యంలో పలు సూచలిచ్చారు. మండల పరిషత్ పాఠశాలల్లో ఏడుగురు, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 17 మంది, ఐటీడీఏ పరిధిలో ముగ్గురు, ఏపీ మోడల్ స్కూల్‌కు నలుగురు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ముగ్గురు.. మొత్తం 34 మందిని కంచిలి మండలానికి డీఎస్సీ-2025లో కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆయా ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇచ్ఛాపురం రూరల్: ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరిన వారికి ఎంఈవోలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్సీ-25 ద్వారా ఎంపికైన 90 మందికి మండల విద్యావనరుల కేంద్రం వద్ద నియమాక ధ్రువ పత్రాలను అందజేశారు. పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని, బోధనలో మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు. 37 మంది ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 49 మంది ఉన్నత పాఠశాలల్లో, నలుగురు క్లస్టర్ పరిధిలో విధుల్లో చేరారు.

భారీ వర్షం

కవిటి: మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీవర్షం కురిసింది. దీంతో వరి, కొబ్బరి సాగు చేస్తున్న రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 60.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.

శివరాంపురం

అభివృద్ధి కనం!

- ఏళ్ల గడిసినా గతిమారని పరిస్థితి
- నదుపాయాల్లేక ప్రజల ఇబ్బంది


అభివృద్ధికి నోచుకోని శివరాంపురం గ్రామం

వజ్రపుకొత్తూరు రూరల్:

ప్రభుత్వాలు మారుతున్నా ఇప్పటికీ చాలా గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న నగరంపల్లి పంచాయతీ పరిధిలోని శివరాంపురంలో సమస్యలు తిష్ట వేయడంతో ప్రజలు సతమతమవుతున్నారు. పాలకులు, అధికారులు మారుతున్నా తమ ఊరు గతి మాత్రం మారడం లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామంలో సుమారు 90 ఇళ్లు ఉండగా సుమారు 300 మంది నివసిస్తున్నారు.

అధ్వానంగా రోడ్డు

మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు పూండి గల్లి నుంచి శివరాంపురం గ్రామానికి సుమారు కిలోమీటరు దూరం ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణానికి పలు ప్రభుత్వాల హయాం మూడుసార్లు శంకుస్థాపన చేసినప్పటికీ అభివృద్ధి మాత్రం మరిచిపోయారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో నగరంపల్లి వెళ్లి చిన్నారులు చదువుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం లేకపోవడంతో కార్యకర్త ఇంటి వద్దే కేంద్రాన్ని నడుపుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు సైతం నిర్వహించకపోవడంతో మురికి వాడను తలపిస్తుంది.

రొయ్యిల చెరువులతో ఇబ్బంది!

గ్రామానికి ఆనుకొని ఉన్న రొయ్యిల చెరువులతో చిన్నపాటి వర్షానికి సైతం జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షా కాలంలో వరద గ్రామంలోకి చేరడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయంటున్నారు. పంట పొలాలు కూడా నీట మునిగిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

శిలాఫలకాలే మిగిలాయి



పూండి గల్లి నుంచి మా ఊరు రావడానికి ప్రధాన రోడ్డు నిర్మాణానికి టీడీపీ సర్కార్ హయాంలో రెండు సార్లు, వైఎస్సార్‌సీపీ హయాంలో ఒకసారి శంకుస్థాపన చేశారు. మూడు శిలాఫలకాలే విగిలాయి తప్పా అభివృద్ధి జరగలేదు. గుంతల రోడ్డుతో ఇబ్బంది పడుతున్నాం. – డి.శరత్, యువకుడు, శివరాంపురం

వర్షా కాలంలో ఇబ్బందే..



వర్షా కాలంలో చాలా ఇబ్బంది పడుతున్నాం. చిన్నపాటి వర్షానికే మా గ్రామం నీటిలో చిక్కిపోతుంది. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోవడంతో ఇబ్బంది పడ్డాం. అధికారులు, నాయకులు వచ్చి చూసి వెళ్తున్నారు తప్పా ఏం చేయడం లేదు.

– ఎం.శ్యామమ్మ, శివరాంపురం

రొయ్యిల చెరువులతో సమస్య



మా గ్రామం పక్కన రొయ్యిల చెరువులు ఉండ డంతో వరద నీరు సముద్రంలో కలవకుండా గ్రామంలోకి చేరుతుంది. ఈ సమస్య ఏళ్ల తరబడి వెంటాడుతుంది. గ్రామంలో సరైన రోడ్లు కూడా లేవు. పారిశుద్ధ్యం క్షీణిస్తోంది.

– ఎల్.లక్ష్మీనారాయణ, శివరాంపురం


శిథిలమైన ఈ రోడ్డే ప్రజలకు దిక్కు


ఎక్సైజ్ అధికారి పి.డి.ప్రసాద్‌కి వినతి పత్రం అందజేస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నాయకులు

వారిద్దరూ రాజీనామా చేయాలి

- మాజీ స్పీకర్ తమ్మినేని, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత విచ్చల విడిగా కల్తీ మద్యం వ్యాపారం సాగుతోందని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ మద్యం వ్యవహారం ఇటీవల బయటపడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ సమన్వయకర్త విజయ అధ్యక్షతన నియోజకవర్గ కేంద్రం ఇచ్ఛాపురం పట్టణంలో నకిలీ, కల్తీ మద్యం, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్‌లో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం స్థానిక ప్రొహిబిషన్ స్టేషన్‌కి చేరుకొని ఎక్సైజ్ అధికారి పి.డి.ప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. కల్తీమద్యం వల్ల నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని, కల్తీ మద్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కుటీర పరిశ్రమంగా కల్తీ మద్యం: మాజీ స్పీకర్ సీతారాం


మీడియాతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కల్తీమద్యం ఒక కుటీర పరిశ్రమలాగా తయారైందన్నారు. ప్రజల ప్రాణాలు, జీవితాలతో ఆటలాడుతూ తయారు చేసిన కల్తీమద్యాన్ని నిరోధించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కల్తీ మద్యం కారణంగా 420 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. పోయిన ప్రాణాలు తీసుకురాగలరా అని ప్రశ్నించారు. ఆఫ్రికాలో డిస్టలరీస్ ఉన్నాయని తనకు తానుగానే జయచంద్రారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఘటనపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే చిత్తూరు మునకల చెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీమ్ పట్టణంలో మద్యం తయారు చేస్తున్నారని ఆరోపించారు. నెల్లూరు, విజయవాడ, ఏలూరు, పాలకొల్లు, పరవాడ తదితర ప్రాంతాల్లో కల్తీమద్యంతో పట్టుబడిన నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఎమైన చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. యావజ్జీవ కారాగార శిక్షకు గురైన కట్టా సురేంద్రనాయుడు గతంలో చంద్రబాబు, లోకేష్ అండలతో బయటపడ్డారని వ్యాఖ్యానించారు. శిక్షలను అనుభవించిన వ్యక్తిలో మార్పు వస్తుంది కాని కట్టా సురేంద్రనాయుడు ఎటువంటి శిక్షలను అనుభవించకుండా జైలు నుండి బయటికి వచ్చాడు కాబట్టే అతను ఏమిచేసిన చెల్లుతోందనే ధోరణిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇతని సహకారంతో కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం కుటీర పరిశ్రమలా తయారైందన్నారు. నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పచెప్పాలని డిమాండ్ చేసారు. కల్తీమద్యం అరికట్టాలని, పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను నిరోధించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. కల్తీమద్యం విషయంలో ఎంతటి పోరాటానికైన వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. అలాగే మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం అండగా ఉండాలన్నారు.

గత ప్రభుత్వంలో కల్తీ మద్యం నిల్: జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ.. గతంలో కల్తీ లేకుండా మద్యం అమ్మకాలను ప్రభుత్వమే చేపట్టిదన్నారు. అదే విధానాన్ని కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యంతో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు.

- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతిదివ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తు ప్రజల పక్షాన తమ పార్టీ తరపున పోరాటం చేస్తున్నామన్నారు. కల్తీమద్యం విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు.
- కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి(పార్లమెంటరీ) పరిశీలకులు దుంపల లక్ష్మణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి నర్తు నరేంద్ర, రాష్ట్ర పంచాయతీ రాజ్ జాయింట్ కార్యదర్శి పూడి నీలాచలం, ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాస్, నిమ్మన దాసు, వైస్ చైర్‌పర్సన్లు లాబాల స్వర్ణమణి, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, రాజారెడ్డి, చిట్టిబాబు, ప్రత్తి అన్వేష్, నర్తు శివాజీ, పూడి నేతాజీ, భాస్కరరావు, బర్ల నాగభూషణ్, కాళ్ల సత్యం, జల్లు యుగంధర్, పిలక సంతు, సల్లా దేవరాజు, కారింగి మోహన్‌రావు, కాళ్ల మదన్, గుమ్మడి రాందాస్, బొండాడ మహేష్, మద్దు వెంకటేష్, పరపటికోటి, కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, బచ్చు జగన్, ప్రదీప్, తేజేశ్వరరావు నాయకులు నీలాపు డిల్లీ, చాట్ల తిరుపతి, సాలిన డిల్లీ, లద్దు కేశపాత్రో, వెంకటరావు, ఆనంద్, బలరాం, సురేష్, ప్రవీణ్, టెంక లోకేష్, ధర్మారావు, పరశురామ్, ప్రియా, యాదవరెడ్డి, గురుమూర్తి అశోక్, లొపింటి దీనబంధు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో బోర్డులు తొలగించండి

- తిలక్ ఆధ్వర్యంలో ఆర్డీవోకు బాధితుల వినతి


ఆర్డీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న తిలక్ తదితరులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడిలో దశాబ్దాలుగా సాగు చేస్తున్న దళితుల భూముల్లో రాత్రి వేళ ఏర్పాటు చేసిన బోర్డులను తక్షణమే తొలగించాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. ఈ మేరకు సోమవారం బాధితులతో కలిసి టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న కొంత మంది అధికార పార్టీ నాయకులు కావాలనే కక్ష కట్టి దళితుల భూములపై కన్నేశారన్నారు. దశాబ్దాల క్రితం భూములతో పాటు అర్హత పత్రాలను అందజేశారని.. ఇప్పుడు ఆయా భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఆయా భూములోల ఎక్కడైనా లోటుపాట్లు జరిగితే వాటిపై విచారణ చేయాలి తప్పా ఇలా బోర్డులు ఏర్పాటు చేసి దళితులను భయాందోళన చేయడం తగదన్నారు. సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే... న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వెల్లడించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. సమస్యపై కొంత మేరకు అవగాహన ఉందన్నారు. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పెద్దబమ్మిడి సర్పంచ్ మెండ తాతయ్య, జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, నాయకులు ఎస్.హేమసుందర్‌రాజు, పి.వెంకట్రావు, కె.సంజీవ్, హెచ్.వెంకటేశ్వర్రావు, యర్ర చక్రవర్తి, జి.గురునాథ్‌యాదవ్, ఎ.రాహుల్, హెచ్.వెంకటరమణ, పి.మోహన్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో ప్రతిభ

టెక్కలి రూరల్: బాపట్ల జిల్లాలో ఈ నెల పది నుంచి 12వ తేదీ వరకూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడా కేంద్రానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14 బాలికల విభాగంలో మెండ తపస్వి 35 కిలోల విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకొని నవంబర్ నెలలో పంజాబ్ రాష్ట్రం లుధియానలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే జనపాన అక్షయ 38 కిలోల విభాగంలో రజతం, బాలుర విభాగంలో అట్టాడ మహిధర్ నాయుడు 38 కేజీల విభాగంలో రజత పతకం సాధించినట్లు కోచ్ నర్సిపురం శేఖర్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడా విభాగ అధికారి డాక్టర్ కల్లేపల్లి శ్రీధర్ అభినందించారు.